ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ కోర్సు

- వర్కింగ్ ప్రొఫెషనల్స్ కోసం ప్రత్యేక కోర్సు
- హెచ్‌సీయూలో శని, ఆదివారాల్లో తరగతులు

రాయదుర్గం: హెచ్‌సీయూలో మరో కొత్త కోర్సుకు శ్రీకారం చుట్టారు. ముఖ్యంగా వర్కింగ్ ప్రొఫెషనల్స్ కోసం ప్రత్యేకంగా ఈ కోర్సును ఏర్పాటు చేశారు. ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ కోర్సును వినూత్న బోధనా విధానం ద్వారా బోధించేలా ఏర్పాట్లు చేయడం విశేషం. ఈ కోర్సు తరగతులను ప్రొఫెషనల్స్‌కు అనుకూలంగా ఉండేలా శని, ఆదివారాల్లో నిర్వహించాలని నిర్ణయించారు. వినూత్న బోధనా విధానం నుంచి ప్రయోజనం పొందేందుకు వ్యక్తిగత తరగతులు పనిచేసే నిపుణులకు సహాయపడతాయని హెచ్‌సీయూ అధికారులు ప్రకటించారు. ఇంటరాక్టివ్ లెక్చర్ మెథడ్స్‌తోపాటు హార్వర్డ్, సేజ్ నుంచి వచ్చిన కేసులను ఉపయోగించి పరిశ్రమకు సంబంధించిన సిలబస్ బోధించబడుతుంది. ఈ కోర్సులు స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్, విశ్వవిద్యాలయంలోని ఇతర విభాగాల నుంచి అనుభవజ్ఞులైన అధ్యాపకులచే బోధించేందుకు ఏర్పాట్లు చేశారు. ఎంపిక చేసిన కోర్సులను ప్రీమియర్ బిజినెస్ స్కూళ్ల నుంచి అధ్యాపకులు, పరిశ్రమకు చెందిన అభ్యాసకులు బోధిస్తారు. మరిన్ని వివరాలకు వెబ్‌సైట్‌ను సంప్రదించగలరు.

అలరించిన సంగీత కచేరి



మాదాపూర్: మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా మంగళవారం సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. అనంతరం డాక్టర్ శోభరాజు శిష్యులు సాహితి, గాయత్రి, వసంతి, ఆశ్రిత, జనని భవిష్యవాణి, చైత్ర, డాక్టర్ శశికళ, సందీప్ శ్రీరాముడి పాటలతో అలరించారు. కీబోర్డు రాజు, తబలా నోవాలు సంగీత సహకారం అందించారు.

బ్లడ్ బ్యాంక్‌కు మోక్షమెన్నడో.. ?

- పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు
- రెడ్‌క్రాస్ సొసైటీ స్పందించినా అధికారుల జాప్యం
- కొత్త ప్రభుత్వం పైనే ప్రజల ఎదురుచూపులు

12 ఏళ్లైనా పూర్తికాని భవనం, అందుబాటులోకి రాని వైనం



గాలిదొడ్డిలో నిరుపయోగంగా ఉన్న రక్తనిధి కేంద్ర భవనం (ఫైల్)

రాయదుర్గం: ఔటర్ రింగురోడ్డు, ఐటీకారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, హైదరాబాద్ నాలెడ్జి సిటీ వంటివి అనూహ్యంగా అభివృద్ధి చెందడంతో వాహనాల రద్దీ కూడా గణనీయంగా పెరిగిపోయింది. ఈ నేపథ్యంలో ప్రమాదాలు కూడా అంతే స్థాయిలో చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ప్రాంతంలో ప్రభుత్వ రంగంలో బ్లడ్ బ్యాంకు ఏర్పాటు ఆవశ్యకత ఏర్పడింది.

అప్పటి మంత్రి చేతుల మీదుగా శంకుస్థాపన..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి ప్రభుత్వ హయాంలో శేరిలింగంపల్లి ప్రాంతంలో ఐటీ కారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ చెంతనే గాలిదొడ్డిలో బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. తదానంతరం స్థలం కేటాయింపు, నిధులు మంజూరు, నిర్మాణ పనులను ప్రారంభించేందుకు అప్పటి జిల్లా మంత్రిగా కొనసాగిన సబితారెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేపట్టారు.

పెరిగినా రద్దీ, ప్రమాదాలు..

పెరిగిన రద్దీతో తరచూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నా.. చికిత్స పొందే వారికి రక్తం అవసరమవుతోంది. స్థానికంగా ఉన్న ఆసుపత్రుల్లో రక్తనిధి అందుబాటులో లేకపోతే ఇక నగరానికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో బ్లడ్ బ్యాంకు ఏర్పాటయ్యే అవకాశం ఉండటంతో ఈ ప్రాంత ప్రజలు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు.

నిలిచిన పనులు..

స్థలం, నిధుల కేటాయింపు, శంకుస్థాపన జరగడంతో ప్రజలందరూ సంతోషించారు. తదానంతరం నిర్మాణ పనులు నిలిచిపోయి ఇప్పటి వరకు తిరిగి ప్రారంభించకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రం, ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు, అధికారులు మారినా బ్లడ్‌బ్యాంకు విషయంలో అడుగు ముందుకు పడటం లేదనే విమర్శలున్నాయి.

కొత్త ప్రభుత్వంపైనే ఆశలు..

రాష్ట్రంలో తిరిగి కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావడంతో భవన నిర్మాణ పనులు పూర్తిచేసి, అవసరమైన నియామకాలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

బ్లడ్ బ్యాంకు వివరాలు..

- 2012లో అప్పటి ప్రభుత్వం జిల్లా స్థాయి బ్లడ్‌బ్యాంక్‌ను ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు.
- గచ్చిబౌలి డివిజన్ గాలిదొడ్డిలోని 1400 గజాల స్థలాన్ని అప్పటి ప్రభుత్వం కేటాయించింది
- ప్రభుత్వం రూ.12 లక్షల నిధులు మంజూరు చేసిన వెంటనే భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అప్పుడు హోంమంత్రిగా ఉన్న మంత్రి సబితారెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన కూడా చేశారు.
- తెలంగాణ ఉద్యమం రావడం, ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు కావడం, రెడ్‌క్రాస్ సొసైటీ విభజనలో జాప్యం కావడంతో ఈ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. అనంతరం నాలుగేళ్ల క్రితం జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చొరవతో కొంత కదలిక ఏర్పడినా.. తిరిగి ఎక్కడ గొంగలి అక్కడే అన్న చందంగా మారింది.
- ఈ భవనానికి చుట్టూ ప్రహరీ, గ్రౌండ్‌ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్ నిర్మించి వదిలేశారు. కిటికీలు, ఇతరత్రా, చివరకు శిలాఫలకం సైతం ప్రస్తుతం కనిపించడం లేదని వినికిడి.

జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చొరవతో కొంత కదలిక..

- జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చొరవతో అర్ధాంతరంగా ఆగిపోయిన భవనాన్ని నిర్మించాలని నాలుగేళ్ల క్రితం సంకల్పించారు.
- రోడ్డు విస్తరణలో కోల్పోయే స్థలం, విద్యుత్ హైటెన్షన్ లైన్ కింద వచ్చే ప్రాంతాన్ని గమనించి మిగిలిన స్థలంలో నిర్మాణాలను చేయాలని తలపెట్టారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో పూర్తిస్థాయిలో నిర్మాణాలు, మొదటి అంతస్తు భవన నిర్మాణానికి అప్పట్లో ఇంజనీరింగ్ అధికారులు అంచనాలు సిద్ధం చేసినట్లు తెలిసింది.
- మైనస్ డిగ్రీల్లో రక్తాన్ని నిల్వచేసే అత్యాధునిక ఫ్రిజ్‌లు, కూలర్లు, ఇతర అత్యాధునిక పరికరాలను కొనుగోలు చేసేందుకు వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులు కూడా అంగీకరించారు.
- రెడ్‌క్రాస్ సొసైటీ చొరవతో జిల్లా కలెక్టర్ సైతం ముందుకొచ్చి దాతల సహకారంతో దీన్ని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంకల్పించినా, జిల్లాలు సైతం విడిపోవడంతో దీని పరిస్థితి మళ్లీ మొదటికి రాగా.. స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజల డిమాండ్లు ఇవే..

- ప్రస్తుతం అర్ధాంతంగా ఆగిన భవన నిర్మాణానికి అవసరమైన నిధులను తక్షణం ప్రభుత్వం కేటాయించాలి.
- భవన నిర్మాణం పూర్తికాగానే బ్లడ్‌బ్యాంకుకు అవసరమైన యంత్రాలు, పరికరాలు, డాక్టర్లు, సిబ్బంది, వైద్య బృందం కూడా నియామకం చేపట్టాలి.
- రక్తం అవసరమైన విధంగా అందుబాటులో ఉండేలా చేయాలి.
- రెడ్‌క్రాస్ సొసైటీ, జిల్లా కలెక్టర్, స్థానిక శాసనసభ్యుడు, కార్పొరేటర్ ప్రత్యేక చొరవ తీసుకుంటే ఈ ప్రాంతవాసులకు బ్లడ్ బ్యాంకు అందుబాటులోకి వచ్చే అవకాశం ఏర్పడుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

నేడు సీతారాముల కల్యాణోత్సవం

రాయదుర్గం: శ్రీరామనవమి సందర్భంగా నేడు గచ్చిబౌలి జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని రాజరాజేశ్వరి సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. బుధవారం ఉదయం 8 గంటలకు గ్రామోత్సవం పేరిట భారీ శోభాయాత్రను నిర్వహించి అనంతరం ఆలయానికి చేరుకుని సీతారాముల కల్యాణాన్ని 12 గంటలకు నిర్వహించేందుకు ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్న ప్రసాద వితరణ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సీతారాముల దర్శనం చేసుకోవాలని వారు కోరారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కుల పంపిణీ



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ

హఫీజ్‌పేట్: మాదాపూర్ డివిజన్ పరిధిలోని సుభాష్ చంద్రబోస్ నగర్ కాలనీకి చెందిన రాధికకు అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా.. రూ.35 వేలు మంజూరైంది. మంగళవారం ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ బాధిత కుటుంబానికి మంజూరు పత్రాన్ని అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. సీఎం రిలీఫ్‌ఫండ్ నిరంతరం సేవలను అందిస్తూ.. ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటుందన్నారు. బీఆర్ఎస్ నాయకులు సాంబశివరావు, అక్కరావు, రాములుయాదవ్, బుజ్జన్న, రామకృష్ణ, సత్యం, నర్సింహ, వెంకటేష్, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం



రాయదుర్గంలో ఎన్నికల ప్రచారంలో బీజేపీ నాయకులు

రాయదుర్గం: చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ పార్టీని గెలిపించాలని కోరుతూ గచ్చిబౌలి డివిజన్ బీజేపీ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మంగళవారం ఇంటింటికి తిరుగుతూ బీజేపీ నాయకులు చేవెళ్ల ఎంపీ బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి ఓటువేసి గెలిపించాలని కోరుతూ.. ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్లకు బీజేపీ కరపత్రాలు, మేనిఫెస్టోలో పొందుపరిచిన అంశాలపై అవగాహన కల్పించారు. మరోసారి ప్రధాని మోదీ కావాలంటే చేవెళ్లలో కూడా బీజేపీని గెలిపించాలని వారు కోరారు. డివిజన్ అధ్యక్షుడు కృష్ణముదిరాజ్ ఆధ్వర్యంలో జిల్లా ఓబీసీ ఉపాధ్యక్షుడు నీలం నరేందర్‌ముదిరాజ్, నాయకులు నరేందర్‌గౌడ్, సురేష్‌ముదిరాజ్, సురేందర్ ముదిరాజ్, దయాకర్, అశోక్‌కుమార్, సంజీవ, చిత్తారీ, నరేందర్ యాదవ్, శ్రీశైలం, నవీన్, సందీప్, సూర్య, మల్లేష్, అనిల్‌కుమార్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

హఫీజ్‌పేట్: క్రీడాకారులకు వేసవిలో దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతో దోహదపడుతాయని హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం చందానగర్ పీజేఆర్ స్టేడియంలో హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతో అవసరమన్నారు. క్రీడాకారులకు చల్లని నీటిని అందజేయాలనే ఆలోచనతో గత 9 ఏళ్లుగా పీజేఆర్ స్టేడియంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. లయన్స్ క్లబ్ సభ్యులు మహిపాల్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, శాంతిభూషన్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, మల్లేష్‌యాదవ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సీతారామస్వామి ఆలయంలో పూజలు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని కోదండ సీతారామస్వామి ఆలయంలో మంగళవారం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, కార్పొరేటర్ కుమార్‌యాదవ్ కలిసి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ శ్రీరామనవమిని పురస్కరించుకొని కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేస్తున్నామన్నారు. స్వామివారి కల్యాణం అనంతరం అన్నదానం చేస్తామని తెలిపారు.

సీతారాముల కల్యాణోత్సవానికి సర్వం సిద్ధం



జీపీఆర్ఏ క్వార్టర్స్‌లో సీతారాముల కల్యాణోత్సవానికి ఏర్పాట్లు..



భెల్ ఎంఐజీకాలనీలోని రామాలయం..

- శ్రీరామనవమి వేడుకలకు భారీ ఏర్పాట్లు
- పచ్చని పందిళ్లతో ఆలయాల ముస్తాబు

శేరిలింగంపల్లి/రాయదుర్గం/హఫీజ్‌పేట్: శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా బుధవారం సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించేందుకు ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. శేరిలింగంపల్లి జంట సర్కిళ్లలోని కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, చందానగర్, మియాపూర్, హఫీజ్‌పేట్, మాదాపూర్ డివిజన్ల పరిధిలోని కాలనీలు, బస్తీల్లోని ఆలయాల వద్ద ఆలయ కమిటీ సభ్యులు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం నుంచి పలు పూజా కార్యక్రమాలను నిర్వహిస్తూ.. చివరగా సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు కూడా భారీ ఏర్పాట్లు చేస్తున్నారు.

- కల్యాణ మహోత్సవం పూర్తికాగానే ఆలయ ప్రాంగణంలో అన్నప్రసాద సమాహారం కూడా నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరైన ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

నేడు గోపన్‌పల్లిలో సీతారాముల కల్యాణం..

గోపన్‌పల్లిలోని హనుమాన్ దేవాలయ ప్రాంగణంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి తెలిపారు. కల్యాణోత్సవం అనంతరం ఆలయ ప్రాంగణంలోనే అన్న సమారాధనకు ఏర్పాటు చేశామని ప్రకటించారు.

కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం



ఇంటింటి ప్రచారంలో ఎంపీ రంజిత్‌రెడ్డి సోదరి, కార్పొరేటర్ పూజిత జగదీశ్వర్‌గౌడ్

మియాపూర్: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించుకుందామని హఫీజ్‌పేట కార్పొరేటర్ పూజిత జగదీశ్వర్‌గౌడ్ తెలిపారు. మంగళవారం చందానగర్ డివిజన్ పరిధిలోని పీఏనగర్ కాలనీలో ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ జైపాల్, కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి సోదరి మంజుల ఇంటింటికి తిరిగి హస్తం గుర్తుకు ఓటువేయాలని ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన గ్యారంటీలను అమలుచేస్తుందన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటువేసి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరికి తోడుగా కాంగ్రెస్ ప్రభుత్వం..

హఫీజ్‌పేట్: కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలందరికీ తోడుగా అండగా నిలుస్తుందని కార్పొరేటర్ పూజితగౌడ్, సీతారంజిత్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని సాయిరాంకాలనీలో ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. డివిజన్ నాయకులు, అధ్యక్షులు, యువకులు, మహిళలతో కలిసి కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ మద్దతు తెలపాలని ప్రజలకు కోరారు. చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ హస్తం గుర్తుకు ఓటువేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అభివృద్ధి ప్రధాన ఎజెండాగా ముందుకు సాగుతున్నారన్నారు. చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థిని గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసుకునే అవకాశం ఉందన్నారు. నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, మైనార్టీ సోదరులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

మాదాపూర్: అక్రమంగా నిర్మించిన భవనాలను ఉపేక్షించేది లేదని అధికారులు తెలిపారు. మాదాపూర్‌లోని గుట్టల బేగంపేట్ సర్వేనెంబర్ 63లో నిర్మించిన అక్రమషెడ్‌లు, నిర్మాణాలను మంగళవారం రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. అనుమతులు లేకుండా నిర్మాణాలను చేపట్టకూడదని, అక్రమ నిర్మాణాలు చేపడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆర్ఐ శ్రీను, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మియాపూర్: మియాపూర్ డివిజన్ పరిధిలోని ఓంకార్ నగర్ కాలనీ సమీపంలో ఉన్న సర్వే నంబర్ -28లో ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మించిన నిర్మాణాలను రెవెన్యూ అధికారులు మంగళవారం కూల్చివేశారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించి కొందరు ప్రైవేటు వ్యక్తులు నిర్మాణాలు చేపట్టారు. ఆర్ఐ శ్రీనివాస్, సీఆర్‌పీఎఫ్ జవాన్ల సహాయంతో అక్కడికి వెళ్లి ఆ నిర్మాణాలు జేసీబీల సాయంతో కూల్చివేశారు. తిరిగి నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



మాదాపూర్ గుట్టలబేగంపేట్‌లో అక్రమ నిర్మాణాలను కూల్చివేయిస్తున్న దృశ్యం



అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న దృశ్యం

ప్రాపర్టీట్యాక్స్ చెక్కులు బౌన్స్..

ట్యాక్స్‌ను తిరిగి చెల్లించిన భవన యజమానులు

శేరిలింగంపల్లి: ప్రాపర్టీట్యాక్స్‌లకు చెల్లించిన మొత్తాలకు భవన యజమానులు ఇచ్చిన బ్యాంకు చెక్కులు బౌన్స్ అయితే కేసులు నమోదు చేస్తామని శేరిలింగంపల్లి డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి తెలిపారు. 2023–24 ప్రాపర్టీట్యాక్స్ చెల్లించేందుకు ఇచ్చిన సుమారు రూ. కోటి విలువైన 60 చెక్కులు బౌన్స్ అయినట్లు తెలిపారు. ఈ విషయాన్ని ఇప్పటికే భవన యజమానులకు జీహెచ్‌ఎంసీ బిల్ కలెక్టర్లకు సమాచారం ఇవ్వగా.. 50 మంది తిరిగి ట్యాక్స్ చెల్లించారని చెల్లించని వారు కూడా సకాలంలో చెల్లించాలని కోరారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నేత



సీఎం రేవంత్‌రెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న శంకర్‌గౌడ్

రాయదుర్గం: కాంగ్రెస్ పార్టీలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కొమరగాని శంకర్‌గౌడ్ మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. సీఎం నివాసంలో శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్, ప్రభుత్వ ముఖ్య సలహాదారు వేం నరేందర్‌రెడ్డి సమక్షంలో సీఎం రేవంత్‌రెడ్డి శంకర్‌గౌడ్‌కు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం సీఎం ఆయనను సన్మానించి జ్ఞాపికను అందజేశారు. చేవెళ్ల పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని సమిష్టిగా పనిచేసి గెలిపించాలని కోరారు. వెంకటేష్‌గౌడ్, మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్ శేరిలింగంపల్లి కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన నలుగురికి సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ సీఐ శ్రవణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నలుగురు వాహనదారులను అదుపులోకి తీసుకొని మంగళవారం కోర్టులో హాజరుపర్చగా జడ్జి ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పున జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

'మాదిగలకు కాంగ్రెస్ ఒక్క సీటు ఇవ్వలేదు'



మాట్లాడుతున్న ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు రావుగాళ్ల బాబు

ఎంఎస్పీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు రావుగాళ్ల బాబుమాదిగ

రాయదుర్గం: రాష్ట్రంలో ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఒక్క సీటు కూడా మాదిగలకు ఇవ్వకుండా వర్గీకరణ చేస్తామంటే నమ్మేదెవరని ఎంఎస్పీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు రావుగాళ్ళ బాబుమాదిగ అన్నారు. మంగళవారం రాయదుర్గంలో ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ ముఖ్య నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మాదిగలకు సమాధానం చెప్పలేకే అబద్ధాలు చెప్తున్న సీఎం, ఆ స్థాయిలో ఉండి ప్రజల ముందు అబద్ధాలు చెప్పడం సరికాదన్నారు. మాదిగలకు పార్లమెంటుకు వెళ్లేందుకు అవకాశం ఇవ్వనోళ్లు వర్గీకరణ చేస్తామనడం హాస్యాస్పదమన్నారు. మందకృష్ణమాదిగకు వచ్చిన బెయిల్‌కు రేవంత్‌రెడ్డికి సంబంధమేలేదని, మాదిగలను కాంగ్రెస్ పార్టీ దూరం చేసిన చరిత్ర రేవంత్‌రెడ్డిదని ఆయన విమర్శించారు. 'మాలలు కుర్చీ లాక్కుంటారో లేదోగానీ.. మాదిగలు మాత్రం పోరాడి కుర్చీ నుంచి ఆయనను దించడం ఖాయమని' ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు పెంటనోళ్ళ నర్సింహ్మ మాదిగ, ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు గణేష్, రమేష్, నరేష్, కొడిచెర్ల ప్రేమ్ పాల్గొన్నారు.

నిన్న కాంగ్రెస్.. నేడు బీఆర్ఎస్..



రాజునాయక్

రాయదుర్గం: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి డాక్టర్ రంజిత్‌రెడ్డి, శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ సోమ వారం ఇంట్లోకి రాగానే కాంగ్రెస్ కండువా కప్పడంతో కాంగ్రెస్ పార్టీలో బీఆర్ఎస్ గచ్చిబౌలి డివిజన్ అధ్యక్షుడు రాజునాయక్ చేరాడని అందరూ భావించారు. తిరిగి మంగళవారం తానే స్వయంగా గులాబీ కండువా కప్పుకుని తాను బీఆర్ఎస్‌లోనే ఉంటున్నానని స్పష్టం చేశారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. తాను బీఆర్ఎస్ పార్టీని వదిలి వెళ్లేది లేదని.. ఈ విషయాన్ని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమి రిశెట్టి సాయిబాబాకు వివరించానన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులే ఎన్నికల ప్రచారంలో భాగంగా మా ఇంట్లోకి వచ్చి కాంగ్రెస్‌పార్టీ కండువా కప్పారని ఆయన పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీలోనే కొనసాగుతానని ఎలాంటి అనుమానాలకు తావు లేదని స్పష్టం చేశారు.

'చిరుధాన్యాల ఆరంభం' స్టోర్ ప్రారంభం

మాదాపూర్: ప్రతి గింజలో పోషక విలువలు ఎక్కువగా ఉంటాయని సినీనటి రకుల్‌ప్రీత్‌సింగ్ అన్నారు. మాదాపూర్‌లో క్యూర్‌ఫుడ్స్‌తో కలిసి ఆరంభం స్టోర్‌ను మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ చిరుధాన్యాలను జీవనశైలిలో భాగస్వామ్యం చేసుకోవాలని తెలిపారు. పోషకవిలువలతో నిండిన చిరుధాన్యాలను వాడటం వల్ల మంచి ఆరోగ్యం, శారీరక సామర్థ్యం పెరుగుతుందన్నారు.



స్టోర్‌ను ప్రారంభించిన రకుల్‌ప్రీత్‌సింగ్

క్యూర్‌ఫుడ్స్ వ్యవస్థాపకుడు అంకిత్ నాగోరి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఉద్యమంలో నడిపించేది పాటే..

- ప్రముఖ గీత రచయిత సుద్దాల అశోక్‌తేజ స్పష్టీకరణ
- హెచ్‌సీయూలో తెలుగు అధ్యాపకులకు కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రామ్



మాట్లాడుతున్న ప్రముఖ గీత రచయిత సుద్దాల అశోక్‌తేజ

రాయదుర్గం: ప్రతి ఉద్యమంలోనూ మనిషిని ముందుండి నడిపించింది పాటేనని ప్రముఖ గీత రచయిత సుద్దాల అశోక్‌తేజ అన్నారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్, మాళవీయ మిషన్ ఉపాధ్యాయ శిక్షణా కేంద్రం, కేంద్రీయ విశ్వవిద్యాలయం హైదరాబాద్, కళాశాల విద్యాశాఖ ఆంధ్రప్రదేశ్ సంయుక్తాధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌లోని డిగ్రీ కళాశాలల తెలుగు అధ్యాపకులకు 10 రోజుల పాటు నిర్వహించే కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రామ్ (సామర్థ్యాల నిర్మాణ కార్యక్రమం)ను మంగళవారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. మానవ చరిత్రలో ఆదిమ కావ్యం పాటేనని, అది శ్రమ నుంచే పుట్టిందని, ఉత్పత్తి ప్రక్రియలోనూ కాయకష్టంలోనూ పనితోపాటేనని, ఆ పాట వర్ధిల్లిందని ఆయన వివరించారు. మానవ మహాప్రస్థానంలో పాట అత్యంత కీలకమైందన్నారు.

మానవ నాగరికతలో..

మానవ నాగరికత ప్రతి మలుపులోనూ మానవ ప్రస్థానాన్ని ముందుకు నడిపించింది కూడా పాటేనని ఆయన గుర్తు చేశారు. మనిషి ప్రతి భావోద్వేగానికి పాట వేదికైందని వివరించారు. మనిషి కష్టసుఖాల్లో మానవుడికి తోడుగా నిలిచిందన్నారు.

ప్రజా వాగ్గేయకారుల స్మరణలో..

అన్నమయ్య, త్యాగరాజు, రామదాసు, సుద్దాల హనుమంతు, అందెశ్రీ, గద్దర్ వంటి భక్తి ప్రజావాగ్గేయకారులను ఈ సందర్భంగా మనం స్మరించుకోవాలన్నారు. మానవీయ విభాగాల డీన్ ఆచార్య కృష్ణ మాట్లాడుతూ.. నూతన విద్యా విధానం-2020 ఉన్నత విద్యా వ్యవస్థలో అనేక కీలకమైన మార్పులే సామాజిక మార్పులకు దారితీస్తాయని, కాబట్టి విద్యావిధానం రూపకల్పనలో మేధావి వర్గమైన అధ్యాపకులు కీలకపాత్ర పోషించాలని సూచించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ఆచార్య ప్రకాష్‌బాబు మాట్లాడుతూ.. హెచ్‌సీయూలోని మాళవీయ మిషన్ టీచర్ ట్రైనింగ్ సెంటర్ ఉన్నత ప్రమాణాలతో విద్యాశాఖలో అధ్యాపకులు, సహాయాచార్యులు, ఆచార్యులకు ప్రత్యేక శిక్షణతో ఉన్నత విద్యాప్రమాణాలను పెంపొందించడం, పరిశోధనా పద్ధతులు, ప్రమాణాలను రూపకల్పన చేయండలో కీలకపాత్ర పోషిస్తాయన్నారు. తెలుగు విభాగాధిపతి ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు, సమన్వయకర్త డాక్టర్ విజయకుమార్ మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ కళాశాలల నుంచి వచ్చిన అధ్యాపకులు, విశ్వవిద్యాలయాల తెలుగు విభాగం ఆచార్యులు, విద్యార్థులున్నారు.

టిప్పర్‌ను ఢీ కొట్టిన బైక్..

ఒకరి మృతి మరొకరికి తీవ్ర గాయాలు

గచ్చిబౌలి: బైక్‌పై వెళ్తూ.. ఆగిఉన్న టిప్పర్‌ను ఢీ కొట్టడంతో ఒకరు మృతి చెందగా.. మరొకరికి తీవ్ర గాయాలైన ఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై మహేందర్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. వట్టినాగులపల్లిలో నివాసం ఉంటూ మేస్త్రీ పనులు చేసే పత్లావత్ హమ్యా (31) తన బావమరిది విస్త్రావత్ మోతిలాల్ (30)తో కలిసి బైక్‌పై సోమవారం అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో గోపన్‌పల్లిలోని జర్నలిస్ట్ కాలనీకి వెళుతున్నారు. ఈ క్రమంలో శ్రీదేవి ఇంజినీరింగ్ కాలేజీ వద్ద కంకర లోడ్‌తో ఆగిఉన్న టిప్పర్ (ఏపీ39యూఎఫ్3329)ను ఢీ కొట్టాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో డ్రైవింగ్ చేస్తున్న హమ్యా అక్కడికక్కడే మృతి చెందాడు. మోతిలాల్ తలకు తీవ్ర గాయాలయ్యాయని, పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

హఫీజ్‌పేట్: ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి రైల్వే ఫారంపై మృతి చెందిన ఘటన చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. లింగంపల్లి ఎంఎంటీఎస్ రైల్వేస్టేషన్ 1వ నెంబర్ ప్లాట్ ఫారం వైపు ఉన్న ఓ గుర్తు తెలియని వ్యక్తి (45) సోమవారం రాత్రి పడి ఉన్నట్లు పెట్రోలింగ్ పోలీసులు గమనించారు. ఒంటిపై ఎలాంటి గాయాలు లేకపోవడంతో అనారోగ్యంతో మృతి చెంది ఉండొచ్చని పోలీసులు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. పరిసర ప్రాంతాల ప్రజలను అడగగా ప్లాస్టిక్ బాటిళ్లు, చెత్త పేపర్లు ఏరుకునే వాడని తెలిపారు. దీంతో అనారోగ్యంతో పాటు ఎండ వేడి తాకిడికి చనిపోయి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు.